క్లుప్తంగా

నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

కోదాడరూరల్‌ : మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యుత్‌ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా సోమవారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌ రూరల్‌ ఏఈ రామిశెట్టి శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కోదాడ అవుట్‌డోర్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని తమ్మర ఇండస్ట్రీయల్‌, ఏజీఎల్‌ ఫీడర్‌ పరిధిలో, తొగర్రాయి సబ్‌స్టేషన్‌ పరిధిలోని కాపుగల్లులో, నల్లబండగూడెం సబ్‌స్టేషన్‌ పరిధిలోని కృష్ణాపాలిప్యాక్స్‌ ఇండస్ట్రీయల్‌ పరిధిలో అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు. అందుకు వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశపరీక్ష



విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్‌ ధనవిజయలక్ష్మి

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 6, 8వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 507మంది విద్యార్థులకు గాను 457మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్‌, చీఫ్‌ సూపరింటెండెంట్‌ ధనవిజయలక్ష్మి విలేకరులకు తెలిపారు. ఈ ప్రవేశపరీక్షను డిపార్ట్‌మెంటల్‌ అధికారి జి.వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

విద్యార్థులకు తాగునీరు ఏర్పాటు

మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు నిర్వహించి పరీక్షకు హాజరైన 457 మంది విద్యార్థులకు ఆదివారం బీఎస్పీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు మాతంగి యేసుబాబు తాగునీరు ఏర్పాటు చేశారు.

కార్మికులకు సంక్షేమ కార్డులు పంపిణీ చేయాలి

నడిగూడెం : భవన నిర్మాణ కార్మికులకు వెంటనే సంక్షేమ కార్డులు పంపిణీ చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వల్లెపు శ్రీనివాస్‌ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్‌ నిర్వహించాలన్నారు. అనంతరం నడిగూడెం గ్రామ శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గుంజ లక్ష్మయ్య, అధ్యక్షుడిగా గుంజ మురళి, ప్రధాన కార్యదర్శిగా దేవరంగుల యల్లయ్య, 10మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో భవన నిర్మాణ సంఘం సీఐటీయూ అనుబంధం మండల అధ్యక్షుడు పల్లపు తిరుమలేష్‌, మండల ప్రధాన కార్యదర్శి చిక్కుళ్ల ఉపేందర్‌, గుంజ చినవెంకన్న, బాలయ్య, పెదవెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గురవయ్య మృతి పార్టీకి తీరనిలోటు



గురవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చిలుకూరు : సీపీఐ సీనియర్‌ నాయకుడు, ఆర్లెగూడెం పార్టీ గ్రామ కార్యదర్శి గురవయ్య మృతి పార్టీకి తీరనిలోటని, ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండలంలోని ఆర్లెగూడెం గ్రామంలో నిర్వహించిన గురవయ్య సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో పార్టీ బలోపేతానికి గురవయ్య చేసిన సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రెమిడాల రాజు, నాయకులు అల్లి వీరబాబు, సాయిబ్‌ అలీ, కాంపాటి వెంకటయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నల్లా కనెక్షన్‌ను తొలగించాలి

మునగాల : మండలంలోని నర్సింహాపురంలో గ్రామపంచాయతీ పైప్‌లైన్‌కు అక్రమంగా నల్లా కనెక్షన్‌ చేసి నీటి వ్యాపారం చేస్తున్నారని తక్షణమై కనెక్షన్‌ను తొలగించాలని గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామపంచాయతీ ఓవర్‌హెడ్‌ ట్యాంకుకు వెళ్లే పైప్‌లైన్‌కు గతంలో కొందరు అక్రమంగా కనెక్షన్‌లు ఏర్పాటు చేసుకోవడంతో తాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామపంచాయతీ సిబ్బంది తొలగించారని, కాగా అర్ధరాత్రి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మెయిన్‌ పైప్‌లైన్‌కు అక్రమంగా కనెక్షన్‌ను ఏర్పాటు చేసుకొని నీటి వ్యాపారం చేస్తున్నాడని ఆరోపించారు. దీంతో గ్రామంలో పూర్తిస్థాయిలో నీటిసరఫరాకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అక్రమ కనెక్షన్‌ తొలగించాలని కోరారు.

నిరాశలో మామిడి రైతులు

- వాతావరణ మార్పులు, ఎర్రనల్లి తెగులుతో కానరాని పూత, కాత
- సరిపడా నీరులేక సరైన సైజుకు రాని కొద్దిపాటి కాయలు
- తీవ్ర నష్టాల్లో రైతులు, కౌలుదారులు

కోదాడరూరల్‌ : ఈ ఏడాది మామిడి తోటల్లో సరైన పూత, కాత లేకపోవడంతో మామిడి రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. మామిడి తోటలకు పేరుగాంచిన కోదాడ మండలంలోని పలు గ్రామాల్లో నేడు తోటల్లో సరైన కాయలు లేక వెలవెలబోతున్నాయి. గంపెడు ఆశలతో ఎదురుచూస్తున్న మామిడి రైతులకు, కౌలుదారులకు ఈ సీజన్‌లో తెగుళ్లతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోదాడ మండలంలో దాదాపుగా 2వేల ఎకరాల్లో మామిడితోటలు విస్తరించి ఉన్నాయి. ఉన్న మామిడి తోటల్లో ఒక్కో ఎకరంలో పట్టుమని పది చెట్లు కూడా కాతకు రాలేదు. మామిడి దిగుబడిపై ఆశతో ముందస్తుగా తోటలను కౌలుకు తీసుకున్న వ్యాపారులు కాతపై ఆశలు అడుగంటడంతో రైతులకు ఇచ్చిన అడ్వాన్స్‌లను వదులకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి ఏడాది టన్ను ధర రూ.20నుంచి రూ.50వేల వరకు ఉండే మామిడి ఈ ఏడాది అతంగా కాత లేకపోవడంతో మార్కెట్‌లో మామిడి ధర కాయ నాణ్యతను బట్టి రూ.40వేల నుంచి రూ.70వేల వరకు ఉందని, ఫిబ్రవరిలో టన్ను ధర లక్ష కూడా అమ్మిందని రైతులు చెబుతున్నారు.

ఎర్రనల్లి తెగులుతో నిలవని పూత, పిందెలు..

ప్రతి ఏడాది డిసెంబర్‌ నెలలో పూతకు వచ్చి జనవరి నెలలో పిందె పడుతుంది. కాని ఈ సంవత్సరం జనవరి చివరి వరకు చాలా చోట్ల పూత రాలేదు. దీంతో రైతుల్లో, కౌలుదారుల్లో గుబులు మొదలైంది. తరువాత ఫిబ్రవరి, మార్చిలో అక్కడక్కడ పూత వచ్చినా అది పిందదశకు రాకుండానే రాలిపోయింది. ఒక ఎకరం తోటలో 30నుంచి 35చెట్లు ఉంటే వాటిలో ఐదు నుంచి పది చెట్లు మాత్రమే కొద్దిగా కాపుకు వచ్చాయని రైతులు అంటున్నారు. వాతావరణ మార్పులతో పాటు, ఎర్రనల్లి పురుగు తీవ్రతతో మామిడితోటల్లో వచ్చిన పూత, పిందె రాలిపోయిందని రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా మార్కెట్‌ విలువ ఉన్న బంగినపల్లి, రసాలు ఎక్కడ కాయలేదు. కొన్ని చోట్ల ఇప్పుడే పిందెలు వచ్చినా అవి కూడా ఫలంగా ఎదగడం కష్టమని రైతులు అంటున్నారు.



కాత లేని మామిడి తోట

కౌలుదారుల కలవరపాటు..

మామిడి తోటలను సాధారణంగా రైతులు వ్యాపారులకు కౌలుకు ఇస్తుంటారు. ప్రతి సంవత్సరం పూత, పింద దశలోనే వ్యాపారులు రైతులతో ఒప్పందం చేసుకొని అడ్వాన్సులు ఇస్తుంటారు. ఎకరంలో 30నుంచి 35వరకు చెట్లు ఉంటాయి. వాటికి కౌలుదారులు తోట, చెట్ల వయస్సును బట్టి రూ.45వేల నుంచి రూ.55వేలకు తీసుకుంటారు. ఈ సంవత్సరం పూత కొంత ఆలస్యమైనా మార్చి మొదటి వారంలో కూడా వస్తుందిలే అనే భరోసాతో పలువురు వ్యాపారులు రైతులకు ముందస్తుగా కొంత అడ్వాన్సులు చెల్లించారు. మార్చి నెల పూర్తైనా పూత, కాత రాకపోవడంతో వారు ఆశలు వదులుకున్నారు.

ఎర్రనల్లి తెగులుతో కాతలేదు



పది సంవత్సరాలుగా మామిడి తోటలను కౌలు తీసుకుంటున్నాను. గతంలో ఎన్నడు లేని విధంగా మామిడితోటలపై వాతవరణ, ఎర్రనల్లి తెగులు ప్రభావం పడింది. నల్లిపురుగుతో పూసిన కొద్ది పూత రాలింది. 25ఎకరాల తోటను కౌలుకు తీసుకున్నాను. ఎకరానికి కౌలు, పెట్టుబడి కలిపి రూ.లక్ష వరకు పెట్టాను. ఈ సారి తోటలను చూస్తుంటే కౌలు కూడా రాని పరిస్థితి కనబడుతుంది.

– బాలేబోయిన రాజుగౌడ్‌, మామిడి కౌలురైతు, కాపుగల్లు

ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి గెలుపు ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న కటికం సత్తయ్యగౌడ్‌

కోదాడరూరల్‌ : నల్లగొండ పార్లమెంట్‌ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌, ఎంపీ ఎన్నికల ఇన్‌చార్జ్‌ కటికం సత్తయ్యగౌడ్‌ అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మోతె, నడిగూడెం, మునగాల మండలాల ముఖ్య నాయకుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈనెల 23న మూడు మండలాల్లో నిర్వహించే ఎంపీ ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేయాలని అన్నారు. కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని, ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. రైతుల పొలాలు ఎండిపోతున్నా కాంగ్రెస్‌ నాయకులు పట్టించుకోవడంలేదన్నారు. పొలాలు ఎండిన రైతులకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం ఇవ్వాలని, రైతు రుణమాఫీని వెంటనే చేయాలని, వరికి ఇస్తామన్న రూ.500బోనస్‌ కూడా తక్షణమే చెల్లించాలని డిమాండ్‌ చేశారు. నాలుగు నెలల్లో కాంగ్రెస్‌ పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు శీలం సైదులు, తొగరు రమేష్‌, పల్లా నర్సిరెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌లు కందిబండ సత్యనారాయణ, రాంరెడ్డి, సీతారాములు, నాయకులు ఏలూరి వెంకటేశ్వరరావు, వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, చంద్రయ్య, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా బీజేపీ ఎన్నికల ప్రచారం



బేతవోలులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

చిలుకూరు : నల్లగొండ పార్లమెంట్‌ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపుడి సైదిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు ఆదివారం మండలంలోని బేతవోలు గ్రామంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్‌ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



మఠంపల్లి : మంత్రి ఉత్తమ్‌ను శాలువాతో సన్మానిస్తున్న ఎంపీపీ పార్వతి, మాజీ ఎంపీపీలు



చిలుకూరు : ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌ చేరిన బేతవోలు సొసైటీ చైర్మన్‌ సైదులు

మఠంపల్లి : మండలంలోని గుర్రంబోడుతండాకు చెందిన ఎంపీపీ ముడావత్‌ పార్వతి, ఆమె భర్త మాజీ ఎంపీపీ కొండానాయక్‌, చౌటపల్లికి చెందిన మరో మాజీ ఎంపీపీ కె.లక్ష్మీవెంకటనారాయణ, మట్టపల్లి దేవాలయ పాలకవర్గ సభ్యుడు కుమ్మరికుంట్ల వెంకటనారాయణ ఆదివారం హుజూర్‌నగర్‌లో మంత్రి ఎన్‌.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. అనంతరం మంత్రి ఉత్తమ్‌ మాట్లాడారు. కాంగ్రెస్‌ పార్టీలో ప్రతిఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని, పార్లమెంట్‌ ఎన్నికల్లో నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డికి భారీ మెజార్టీ వచ్చేలా కృషిచేయాలని కోరారు. వారితో పాటు పార్టీలో చేరిన వారిలో చౌటపల్లి ఎంపీటీసీ సైదమ్మకాశయ్య, మాజీ దేవాలయ కమిటీ చైర్మన్‌ కొండా నాగేశ్వరరావు, మాజీ వార్డుసభ్యుడు మల్లా రామకృష్ణ, రైతు సమన్వయ సమితి మండల సభ్యులు భద్రంరాజు వెంకటరామయ్యకు మంత్రి కాంగ్రెస్‌ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకుడు సాముల శివారెడ్డి, మాజీ జెడ్పీటీసీ అరుణాసైదులు, కాంగ్రెస్‌ మండల వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ వంటిపులి శ్రీనివాస్‌, మాజీ సర్పంచ్‌ బోగాల పిచ్చిరెడ్డి, తదితరులున్నారు.

పీఏసీఎస్‌ చైర్మన్‌ కాంగ్రెస్‌లో చేరిక

చిలుకూరు : మండల పరిధిలోని బేతవోలు ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌ బాషం సైదులు ఆదివారం బీఆర్‌ఎస్‌ పార్టీ నుంచి ఎమ్మెల్యే ఉత్తమ్‌ పద్మావతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ పార్టీ చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితుడినై కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, పిండ్రాతి హనుమంతరావు, కాంగ్రెస్‌ నాయకులు బొలిశెట్టి నాగేంద్రబాబు, బండ్ల కోటయ్య, వట్టికూటి నాగయ్య, యడవెల్లి పుల్లారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



నేరేడుచర్ల : ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

నేరేడుచర్ల : పట్టణంలోని శ్రీకోదండరామాలయంలో దేవతామూర్తుల విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠామహోత్సవాన్ని ఆదివారం వేదపండితులు కనుల పండువగా నిర్వహించారు. దేవతామూర్తుల ప్రాణప్రతిష్ఠ అనంతరం దివ్య మంగళ రూపంలో కోదండరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి స్వాములను భక్తులు దర్శించుకున్నారు. వేదపండితులు ఉప్పల ఫణీంద్రశర్మ, నెమ్మాని వెంకటరమణమూర్తి నేతృత్వంలో గణపతి పూజ, పుణ్యాహావచనం, భక్తన్యాసం తదితర పూజలను నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన అనంతరం భక్తులు నవధాన్యాలు వేసి పూజలు నిర్వహించారు. వేద పండితులు అష్టబలి, కుంభబలి కార్యక్రమాలను నిర్వహించి, దేవతామూర్తులకు శాంతి కల్యాణాన్ని చేపట్టారు. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కలకోవలో విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు..

మునగాల : మండలంలోని కలకోవలో ఇటీవల నూతనంగా నిర్మించిన రామాలయంలో శ్రీసీతారామచంద్రస్వామి, హనుమాన్‌ జీవధ్వజ శిఖర, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, ద్వారపాలక విగ్రహ ప్రతిష్ఠామహోత్సవాలను ఆదివారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరం నెలకొంది. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే పద్మావతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను దేవాలయ కమిటీ చైర్మన్‌ జూకూరి గుర్వయ్య పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్‌ జూకూరి గుర్వయ్య, వైస్‌ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, తాజా మాజీ సర్పంచ్‌ కొంపెల్లి సుజాత, ఎంపీటీసీ గన్నా భవానీ, మునగాల, మోతె మండలాల కాంగ్రెస్‌ అధ్యక్షులు కొప్పుల జైపాల్‌రెడ్డి, కీసర సంతోష్‌రెడ్డి, గ్రామపెద్దలు కొంపెల్లి వీరబాబు, గన్నా నరసింహారావు, పనస శంకర్‌, దొంగరి అప్పారావు, పనస సింహాద్రి, కుడుముల వీరయ్య, కుడుముల వెంకటేశ్వర్లు, మునగలేటి వీరబాబు, చిర్రా శ్రీను, పనస విజయ్‌, దొంతగాని రవి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గానుగబండలో ప్రతిష్ఠాపనోత్సవాలు

గరిడేపల్లి : మండల పరిధిలోని గానుగబండలో నిర్వహిస్తున్న విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం కొనసాగాయి. శ్రీ శీతల పరమేశ్వరి బొడ్రాయి ప్రతిష్ఠ, ముత్యాలమ్మ, కోటమైసమ్మ, పోతురాజులు, సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ శిఖర తీర్థ ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గణపతి పూజ పుణ్యాహవాచనము, మండల హోమములు క్షీరాధివాసం, పంచగవ్యాధివాసం జలాధివాసం కార్యక్రమాలను నిర్వహించారు. పూజారులు బ్రహ్మశ్రీ ద్వారా శ్రీనివాసశర్మ, బ్రహ్మశ్రీ సత్యనారాయణ శర్మ, బ్రహ్మశ్రీ జొన్నలబట్ల కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో సోమవారం ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



మునగాల : ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మావతి



గరిడేపల్లి : ఉత్సవాల్లో పాల్గొన్న పూజారులు



నేరేడుచర్ల : కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

ఐకమత్యంతోనే సమస్యలు పరిష్కారం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నడిగూడెం : ఐకమత్యంతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి చిక్కుళ్ల ఉపేందర్‌ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సిరిపురంలో నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రంగాలలో పనిచేస్తున్న కార్మికులు కలిసికట్టుగా ఉండి తమ హక్కుల కోసం పోరాడితేనే ఫలితాలు పొందవచ్చన్నారు. అనంతరం సంఘం గ్రామ కమిటీ ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా రాయపూడి శ్రీను, కార్యదర్శిగా పొట్టి శ్రీను, గౌరవ సలహాదారుడిగా బండారు శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు కొత్తపల్లి చిట్టి, జమ్ముల వెంకటేశ్వర్లు, కృష్ణ, లింగయ్య, రమేష్‌, పుల్లయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవ పూజలు



ఆలయ వార్షికోత్సవ పూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్‌ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి దేవాయంలో ఆలయ వార్షికోత్సవం కొనసాగుతుంది. ఆదివారం ఆలయంలో చైత్ర శుద్ధ త్రయోదశి పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, సేవాకాలం, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, మంగళశాసనం, ఆరగింపు, తీర్థప్రసాద వితరణ అనంతరం గరుడసేవతో స్వామివార్ల ఊరేగింపు కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై శ్రీనివాసచార్యులు, హరీష్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు యరగాని భిక్షం, యరగాని నర్సింహారావు, గురవయ్య, వీరబాబు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

తాటి ముంజలకు భలే గిరాకీ



కోదాడ పట్టణంలో ముంజలు విక్రయిస్తున్న యువకుడు

కోదాడరూరల్‌ : ఈ ఏడాది వేసవికాలంలో తాటి ముంజలకు మంచి డిమాండ్‌ ఉంది. ప్రతి వేసవిలో ఎండలు ఉంటున్నప్పటికీ ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు చల్లని పానీయాలు, పండ్లరసాలు, పుచ్చకాయలు వంటి నీటిశాతం ఎక్కువగా ఉండే పండ్లను తీసుకుంటారు. వాటితో పాటు కేవలం వేసవికాలం సీజన్‌లో మాత్రమే లభించే ముంజలను తినేందుకు ప్రజలు మక్కువ చూపిస్తున్నారు. వాటిని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంతో పాటు శరీరానికి కావాల్సిన పోషకవిలువలు ఉండటంతో ఈ ఏడాది ముంజలకు గిరాకీ పెరిగింది. అయితే గత ఏడాది డజను ముంజలను రూ.40నుంచి రూ.50లకు విక్రయించగా ఈ ఏడాది రూ.60నుంచి రూ.70వరకు విక్రయిస్తున్నారు. కోదాడ పట్టణంలోని మున్సిపల్‌ కార్యాలయం వద్ద ముంజలు కొట్టి విక్రయిస్తుండగా, బస్టాండ్‌ ఎదురుగా బుట్టల్లో తీసుకొచ్చి అమ్ముతున్నారు. కోదాడ పట్టణానికి మునగాల మండలంలోని తాడ్వాయి, కలుకొవ, నారాయణగూడెం, కృష్ణానగర్‌, నడిగూడెం, బృందావనపురం గ్రామాలకు చెందిన గీత కార్మికులు, మహిళలు వచ్చి విక్రయిస్తున్నారు. గ్రామాల్లో తాటిచెట్లు నరికి వేస్తుండటంతో ముంజలు దొరకడం లేదని గీత కార్మికులు అంటున్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కెఎల్‌ఎన్‌ ప్రసాద్‌

మునగాల : మండలంలోని నర్సింహులగూడెంలో ఆదివారం కంఠమహేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కౌండిన్య గౌడసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కెఎల్‌ఎస్‌ ప్రసాద్‌ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు గౌడ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెఎల్‌ఎస్‌.ప్రసాద్‌ మాట్లాడారు. కంఠమహేశ్వర స్వామి ఆశీస్సులు అందరికి లభించాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్‌, గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, న్యాయవాది ఉయ్యాల నర్సయ్య, గోసుల రాజేష్‌, పెద్ది నాగరాజు గౌడ్‌, శ్రీకాంత్‌గౌడ్‌, గౌడసంఘం పెద్దలు పాల్గొన్నారు.

మున్సిపల్‌ ముద్రగల మాంసాన్నే విక్రయించాలి



యాటలకు వైద్య పరీక్షలు చేస్తున్న అధికారులు

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలో మటన్‌ వ్యాపారులు తప్పనిసరిగా మున్సిపల్‌ కబేళాలో వెటర్నరీ డాక్టర్‌ పర్యవేక్షణ, మున్సిపల్‌ ముద్ర గల యాట మాంసాన్ని మాత్రమే విక్రయించాలని మున్సిపల్‌ కమిషనర్‌ బి.శ్రీనివాసు అన్నారు. ఆదివారం మున్సిపల్‌ కమిషనర్‌ ఆదేశానుసారం మున్సిపల్‌ సానిటరీ ఇన్‌స్పెక్టర్‌ సారగండ్ల శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్‌ కబేళాలో యాటలకు వెటర్నరీ డాక్టర్‌ జానయ్య వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి ఆదివారం వైద్య పరీక్షలు పూర్తయిన మాంసాన్ని ప్రజలు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్‌ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సురేష్‌, బూర సతీష్‌, ఎన్విరాన్మెంట్‌ ఇంజనీర్‌ శివప్రసాద్‌, మున్సిపల్‌ జవాన్లు కొండేటి వెంకన్న, పరశురాములు, వేణు, శ్రవణ్‌కుమార్‌ పాల్గొన్నారు.

సంత్‌ నిరంకారి సేవలు అభినందనీయం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న జగదీష్‌రెడ్డి

భానుపురి : సమాజంలో సంత్‌ నిరంకారి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌ రెడ్డి అన్నారు. ఆదివారం మానవ ఐక్యత దినోత్సవం పురస్కరించుకొని ఆ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సంత్‌ నిరంకారి ఆధ్వర్యంలో సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను ముమ్ముందు కూడా కొనసాగించాలని, అందుకు తన వంతు సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సరళ దేవి, కడారు నరసింహారెడ్డి, విద్యాసాగర్‌, రమాదేవి, శోభ, నిర్మల, అంజలి, రాజేష్‌, హరీష్‌ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం



రెండో వార్డులో అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ

చిలుకూరు : మండల కేంద్రంలోని ఆయా వీధుల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. గ్రామపంచాయతీలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో డ్రెయినేజీల్లో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయింది. దీంతో దోమలు వ్యాప్తి చెంది రాత్రి సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అదే విధంగా జ్వరాలు భారీన పడాల్సివస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని కోరుతున్నారు. ఈ విషయంపై గ్రామపంచాయతీ కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్‌ను వివరణ కోరగా.. సరిపడా సిబ్బంది లేకపోవడంతో పూర్తి స్థాయిలో డ్రెయినేజీలు శుభ్రం చేయించలేకపోతున్నామని తెలిపారు.

గంగదేవమ్మకు పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నేరేడుచర్ల : మండలంలోని జానలదిన్నె గ్రామంలో గల గంగదేవమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఎస్‌ఐ రవీందర్‌నాయక్‌, నిర్వాహకులు తక్కెళ్ల నాగార్జున, గుండెబోయిన భాస్కర్‌, కోటయ్య, సందీప్‌, లింగరాజు, భక్తులు పాల్గొన్నారు.